22022024-MAI-04_Layout 1 2/21/2024 11:00 PM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

ప్రజాస్వామ్యానికే సుప్రీం ఓటు

ఎన్నికైన ప్రజాప్రతినిధులు పార్టీలు మారడం, ప్రభుత్వాలు తారుమారు కావడం అనాదిగా జరుగుతున్నదే. కానీ, రిటర్నింగ్ అధికారే ఓటును ఖరాబు చేయడం అనేది ప్రజాస్వామ్యంలో అనూహ్య పరిణామం. దీనివల్ల నిష్పాక్షికత నిర్వీర్యమైపోయి పవిత్రమైన ఓటు అపహాస్యం పాలవుతుంది. నమ్మకం వమ్మయిపోతుంది. మొత్తంగా ప్రజాస్వామ్యమే గంగలో కలుస్తుంది. చండీగఢ్ మేయర్ ఎన్నికల్లో ఈ తరహా అఘాయిత్యమే జరిగింది. దీనిపై సుప్రీంకోర్టు వెలువరించిన తాజా తీర్పు కుటిల రాజకీయానికి చెంపపెట్టు వంటిదని చెప్పాలి. ఆప్‌కు బదులుగా బీజేపీ మేయర్ అభ్యర్థి గెలిచినట్టు ప్రకటించేందుకు ప్రిసైడింగ్ అధికారి అనిల్ మసీహ్ స్వయంగా కొన్ని బ్యాలెట్లను కొట్టివేయడంపై సుప్రీంకోర్టు మండిపడింది. ఆయనను ప్రాసిక్యూట్ చేయాలని ధర్మాసనం ఆదేశించడం గమనార్హం.

ప్రజాస్వామ్యంలో ఎవరైనా గెలవాలనే పోటీ చేస్తారు. కానీ గెలిచేందుకు అడ్డదార్లు తొక్కడం, అందుకు తటస్థ అధికారులు చేతివాటంతో తోడ్పాటు అందించడం ఏమాత్రం క్షంతవ్యం కాదు. ప్రజలు చైతన్యవంతులయ్యారు. వారి కన్నుగప్పి మోసగించడం సాధ్యమయ్యే పని కాదు. ఆధునిక సాంకేతికత పారదర్శకతను పెంచింది. గతంలో జరిగిన అవకతవకల కారణంగా ఎన్నో బిగింపులు కూడా అమలులోకి వచ్చాయి. ఇన్ని ఉన్నప్పటికీ పైన తెలిపిన ఉదంతం జరగడం అతిపెద్ద ప్రజాస్వామిక దేశంగా ప్రశంసలు అందుకునే భారత్‌కు తలవంపులు తెచ్చింది. పైగా దేశంలో అప్రతిహత పాలకపక్షంగా కొనసాగుతున్న బీజేపీకి చెందిన వ్యక్తి ఇలా ఓటు హననానికి పాల్పడటం ఏమాత్రం ఉపేక్షించదగ్గ విషయం కాదు. ఒకవేళ ఇది స్థానిక నాయకత్వం ప్రమేయంతో జరిగిందని భావించినా.. జాతీయ నాయకత్వం ఇలాంటి ఓటు మోసాలు దేశానికి చేటు తెస్తాయని గుర్తించాలి. దీనిపై సరైన విధంగా స్పందించి పార్టీపరంగా కఠినచర్యలు తీసుకోవాలి.

ఇక అంతర్గత ప్రజాస్వామ్యం విషయంలోనూ బీజేపీ అనుసరిస్తున్న విధానాలు ప్రశ్నార్థకమవుతున్నాయి. పార్టీ అధ్యక్షుని నియామకం, పదవీకాలం పొడిగింపుపై పార్టీ పార్లమెంటరీ బోర్డుకు అధికారం కల్పించడం చర్చనీయాంశమవుతున్నది. అందుకు పార్టీ రాజ్యాంగాన్ని సవరిస్తూ ఇటీవల జాతీయ సదస్సులో తీర్మానించడం గమనార్హం. పార్లమెంటరీ బోర్డు అత్యున్నత విధాన నిర్ణాయక విభాగమే కావచ్చు. కానీ, పార్టీ సభ్యులు ఎన్నుకోవాల్సిన పదవిని బోర్డు నియామక పరిధిలోకి తేవడం అంతర్గత ప్రజాస్వామ్యాన్ని పక్కన పెట్టడమే అవుతుంది. ఒకరకంగా ఇది కాంగ్రెస్ సంస్కృతిని కాపీ కొట్టడమే. కాంగ్రెస్‌లో పార్టీ వ్యవస్థ ఎప్పుడూ అధికారం చుట్టే తిరుగుతుంది. సుదీర్ఘకాలం దేశాన్ని పాలించడం వల్ల ఆ సంస్కృతి కాంగ్రెస్‌కు అబ్బి ఉండవచ్చు. కానీ, ఈ విషయంలో కాంగ్రెస్‌లోనే మార్పులు చోటుచేసుకుంటున్న సంగతి తెలిసిందే. అయితే, కాంగ్రెస్ ముక్త్ భారత్‌ను కోరుకునే బీజేపీ పాత సంస్కృతిని అనుసరించడం అంతగా శోభించదు. పైగా రెండు విడతల అధికారాన్ని అనుభవించి మూడో విడతకు అర్రులు చాస్తున్న వేళ ప్రజాస్వామ్య వ్యవస్థ, విలువల పట్ల తన నిబద్ధతను మరింత బలంగా చాటుకోవాల్సి ఉందని బీజేపీ గుర్తించాలి.

బహుముఖ ప్రజ్ఞాశాలి పాలకుడైతే?

కనకదుర్గ దంటు
89772 43484

మహాభారతంలోని వీరులందరిలో బలవంతుడైన భీముడు ఓసారి హనుమంతుడి తోకను కూడా కదిలించలేకపోయాడు. ఇది తెలిసిన ఏ చిన్నపిల్లాడైనా సరే టకీమని చెప్పేస్తాడు 'భీముడి కంటే హనుమంతుడు గొప్పవాడు, బలవంతుడు' అని. అలాగే ఏ రంగంలోనైనా ఒక విజయం సాధించినవాడి కంటే తాను గొప్పవాడినని అనిపించుకోవాలని తాపత్రయపడేవారు చేయాల్సిన పని ఏమిటంటే.. ఆ మనిషి కంటే ఎక్కువగా సాధించి చూపటం. అంతేకానీ, ఆ మనిషి సాధించిన విజయాలను చిన్నవిగా చేయాలనుకోవడం, నామరూపాలు లేకుండా నిర్మూలించాలనుకోవడం తెలివి తక్కువ పని అవుతుంది. అంతేకాకుండా అదెంతో కష్టతరమైనది, సమయం వృథా చేసేది కూడా.

తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నాయకుల ప్రస్తుత తీరు ప్రజలను అలజడికి గురిచేస్తున్నది. తొమ్మిదిన్నరేండ్ల పాలనలో కేసీఆర్ సాధించిన విజయాలు అనేకం. ఆయన వాటిని ఎలా సాధించారో గమనిస్తే ఒక విషయం స్పష్టమవుతుంది. నకారాత్మకంగా ఎవరికంటేనో గొప్పవాడినైపోవాలన్న ఆలోచన పెట్టుకోకుండా, తనకు ముందరి నాయకులు చేసిన పనిని, సాధించిన విజయాలను విశ్లేషించుకొని, వారికంటే విజయవంతంగా తన పథాన్ని తీర్చిదిద్దుకున్నారు కేసీఆర్. అవేమిటో ఓసారి చూద్దాం. ముఖ్యంగా ఎవరికైనా, ఏ పనిలోనైనా విజయం సిద్ధించాలంటే ఆ మనిషి కంటే పనికి సంబంధించిన విజయమే ప్రజలకు కనిపించాలి. ఆ పనిలోని చిత్తశుద్ధి ముఖ్యం కాని ఆ మనిషి కనిపించటం కాదు.

తెలంగాణ సిద్ధించి ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టాక కేసీఆర్ మొదటగా ఆలోచించినది వాతావరణ శుద్ధి గురించి. అందుకే సుందర్‌లాల్ బహుగుణ చేసిన చిప్కో ఉద్యమంలాగా హరితహారం కార్యక్రమాన్ని మొదలుపెట్టారు కేసీఆర్. మనుషుల ఆరోగ్యానికి, ఆనందానికి వాతావరణ కాలుష్యం అడ్డురాకుండా కొన్ని కోట్ల మొక్కలు నాటించారు. దాన్ని ఒక ఉద్యమంలా నడిపించారు. గాంధీ మహాత్ముడి స్వాతంత్ర్య సమరంలాగా దాదాపు ఒకటిన్నర దశాబ్దం పాటు పూర్తిగా అహింసా మార్గంలో తెలంగాణ ఉద్యమాన్ని నడిపి రాష్ట్రాన్ని సాధించారు కేసీఆర్. మరో అహింసావాది దక్షిణాఫ్రికా నాయకుడు నెల్సన్ మండేలాలాగా ప్రత్యేక రాష్ట్రం సాధించి, వలస పాలకుల చెర నుంచి రక్షించారు. మానవ మనుగడకు అతిముఖ్యమైన తాగునీటిని మిషన్ భగీరథ ద్వారా, సాగునీటిని మిషన్ కాకతీయ ద్వారా సాధించారు. తద్వారా రాష్ట్రంలో నికర జలాలను నిల్వ చేశారు. భూగర్భజలాలు పెరిగేటట్టు చేశారు. రాజస్థాన్‌లోని ఎడారిలో నీటిని నిలిపి పంటలు పండించిన వాటర్‌మ్యాన్ ఆఫ్ ఇండియా రాజేంద్రసింగ్ నుంచి కూడా ప్రశంసలు పొందారు. మనదేశానికి స్వాతంత్ర్యం రాకముందు కావేరి, గోదావరి నదులపై ప్రాజెక్టులు కట్టి ఆ ప్రాంతాలను కరువు, అతివృష్టి నుంచి కాపాడిన సర్ ఆర్థర్ కాటన్‌ను ఇప్పటికీ దేవుడిలా కొలుస్తారు

ఆయా ప్రాంతాల ప్రజలు. వలస పాలనలో నెర్రెలుబారిన తెలంగాణలో కేవలం తొమ్మిదిన్నరేండ్లలో జలాశయాల నిర్మాణం చేపట్టి, పూర్తి చేశారు కేసీఆర్. కాళేశ్వరం ప్రాజెక్టు, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ, బస్వాపూర్ వంటి భారీ నిర్మాణాలను రికార్డు సమయంలో పూర్తి చేసి తెలంగాణను అన్నపూర్ణను చేశారు. అత్యధిక పంట దిగుబడులు సాధించటానికి మార్గం సుగమం చేశారు.

> కర్ణాటకకు చెందిన శ్రీకాంతయ్య అందరికీ స్వచ్ఛమైన తాగునీరు అందించాలని కృషి చేస్తున్న మహనీయుడు. ఆయనలాగే కేసీఆర్ కూడా తన భగీరథ పట్టుతో కొద్దికాలంలోనే మిషన్ భగీరథ ద్వారా రాష్ట్రంలోని అన్ని ఇండ్లకు స్వచ్ఛమైన తాగునీరు అందించారు. తద్వారా దశాబ్దాలుగా నల్లగొండను పట్టి పీడిస్తున్న ఫ్లోరైడ్ భూతాన్ని తరిమికొట్టారు. మహాత్మాగాంధీ గ్రామస్వరాజ్యం భావనను ఆచరించే కేసీఆర్.. పట్టణాల తరహాలో పల్లెలు కూడా ప్రగతి సాధించాలని సంకల్పించారు. మారుమూల తండాలు, గ్రామాలు అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో పల్లెప్రగతి పథకాన్ని తీసుకొచ్చారు. మారుమూల తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చారు.

వేల గ్రామ పంచాయతీలను ఆర్థికంగా బలోపేతం చేసి స్వయం సమృద్ధి సాధించేలా చేశారు. అధిక దిగుబడి ఇచ్చే వంగడాలను ప్రపంచానికి అందించిన నార్మన్ బోర్లాగ్‌లాగా వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేశారు కేసీఆర్. మద్దతు ధరకే వ్యవసాయ ఉత్పత్తులు కొనుగోలు చేసేలా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పెట్టుబడి సాయం, రైతులకు పంటల విషయంలో దిశానిర్దేశం.. ఇలా ఆయన దార్శనికత వల్ల ధాన్యం కొనుగోళ్లలో ఒకప్పుడు 14వ స్థానంలో ఉన్న తెలంగాణ ఇప్పుడు 2వ స్థానానికి ఎదిగింది. తమిళనేత కరుణానిధిలాగా ఎన్నికల్లో ఎక్కువసార్లు గెలిచిన రాజకీయ నాయకుడు కేసీఆర్. ఎమ్మెల్యేగా, ఎంపీగా, రాష్ట్ర మంత్రిగా, కేంద్ర మంత్రిగా, రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ముఖ్యమంత్రిగా కూడా పని చేశారాయన. కంటివెలుగు వంటి పథకాలకు శ్రీకారం చుట్టి అందరికీ కంటి పరీక్షలు చేయించారు. అద్దాలు ఇచ్చి, అవసరమైన వారికి ఆపరేషన్లు కూడా చేయించారు.

పుస్తకాలు బాగా చదివే అలవాటున్న కేసీఆర్‌కు దేశంలోని, ప్రపంచంలోని రాజకీయ, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక అంశాలపై అవగాహన అత్యద్భుతంగా ఉన్నది. ప్రజలకు ఏ పథకం వల్ల నిజమైన సహాయం అందుతుందన్న విషయం ఆయనకు తెలిసినంతగా మరెవరికీ తెలియదు. 1954లోనే పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టిన తమిళ నాయకుడు కామరాజ్ నాడార్ బాటలో.. వెయ్యికిపైగా కొత్త పాఠశాలలను ప్రారంభించిన కేసీఆర్ వాటన్నింటిలో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టారు. పుష్టికరమైన, నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించారు. కొత్తగా విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని కూడా ప్రారంభించారు. దీనివల్ల విద్యార్థుల ఆరోగ్యం, చదువుల్లో వారి సామర్థ్యం పెరిగాయి. ప్రజల ఆధ్యాత్మిక జీవనానికి ఎంతో తోడ్పాటునందించారు కేసీఆర్. ఆలయాలను అభివృద్ధి చేశారు. స్వాతంత్ర్యానంతరం పురాతన సోమనాథ్ ఆలయాన్ని సర్దార్ పటేల్ పునరుద్ధరించారు. మరో అడుగు ముందుకు వేసిన కేసీఆర్ వేల గుడుల్లోని పూజారులకు జీతాలు, ధూపదీప నైవేద్యాలకు నిధులను సమకూర్చారు. యాదాద్రి, బాసర, ధర్మపురి, భద్రకాళి వంటి ఆలయాలను ఆగమ శాస్త్ర నియమాల ప్రకారం పునర్నిర్మించారు.

నిజాం కాలంలో అస్తవ్యస్తంగా ఉన్న పాలన, ఆర్థిక రంగాన్ని అప్పటి ప్రధానమంత్రి సాలార్‌జంగ్-1 సవరణల ద్వారా చక్కదిద్దారు. ధరణి లాంటి పోర్టల్ ద్వారా వ్యవసాయ భూముల రికార్డుల్లో సంస్కరణలను చేపట్టారు కేసీఆర్. సకలజనుల సర్వే ద్వారా తెలంగాణలోని కుటుంబాల వివరాలు పాలకులకు అందుబాటులో ఉండేట్టు చేశారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో, కార్పొరేషన్లలో అవినీతిని అంతం చేశారు. ప్రజల పనులు సులభంగా పూర్తయ్యేలా చేశారు. వలస పాలకుల నిర్లక్ష్యంతో నరకాలుగా మారిన దవాఖానలను సమూలంగా మార్చేశారు. అధికారుల పిల్లలు కూడా ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లేంతగా వాటిలో వసతులు సమకూర్చారు. మారుమూల ప్రాంతాల్లోని గర్భిణులకు ప్రసూతి సమయంలో ప్రయాణ వసతి కల్పించారు. రాష్ట్రంలో వైద్యరంగాన్ని మరింతగా పటిష్ఠం చేసేందుకు 21 ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రారంభించారు.

> రాష్ట్రానికి వన్నె తెచ్చే ఎన్నో కట్టడాలు నిర్మించారు కేసీఆర్. నిజాముల కాలంలో ప్యాలెస్‌లు కట్టుకుంటే.. ప్రజాస్వామ్యంలో ప్రజల సౌకర్యార్థం సచివాలయం, అమరవీరుల స్మారకం, అంబేద్కర్ విగ్రహం, సెంట్రల్ కమాండ్ భవనాలు, సమీకృత కలెక్టరేట్, మెట్రో, ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, వరద నీటిని కట్టడి చేసేందుకు నాలాల వంటి ఎన్నో నిర్మాణాలు చేపట్టారు కేసీఆర్.

బహుభాషా కోవిదుడు, భాషాభిమాని పీవీ నరసింహారావు తెలుగు అకాడమీ వంటివి స్థాపించి భాషాభివృద్ధికి ఎంతో కృషి చేశారు. ఆయనలాగే కేసీఆర్ కూడా సాహితీవేత్త, మాతృభాషా ప్రేమికుడు. అందుకే మాతృభాషను బతికించుకునేందుకు పాఠశాలల్లో తెలుగు తప్పనిసరిగా బోధించాలని నియమం విధించారు. కేసీఆర్ ప్రతి ప్రసంగంలోనూ భాషపై ఆయనకున్న పట్టు మనకు కనిపిస్తూనే ఉంటుంది. ప్రపంచ మహాసభలో (2017) ఆయన చేసిన ప్రసంగం ఒక రాజకీయ నాయకుడి భాషణలాగా లేదు. తలపండిన ఒక తెలుగు ఆచార్యుడిలాగా సాగి శ్రోతలను మంత్రముగ్ధుల్ని చేసింది. తెలుగురాష్ట్రాల్లో బీద ప్రజల సంక్షేమం గురించి మొట్టమొదటగా తపనపడింది ఎన్టీ రామారావు. ఆయన్ను చాలా ఇష్టపడే కేసీఆర్ ఆ స్ఫూర్తితోనే ఎన్నో వినూత్న పథకాలను తీసుకొచ్చారు. నిస్సహాయులైన వృద్ధులు ఆయనలో తమ పెద్దకొడుకుని, దివ్యాంగులు, కల్యాణలక్ష్మి లబ్ధిదారులు ఆయనలో తమ మేనమామను చూసుకుంటారు. ఇలా పేదలకు ఉపయోగపడే 350కి పైగా సంక్షేమ పథకాలకు రూపకల్పన చేశారు కేసీఆర్. మేధస్సు, దార్శనికత, ప్రజాభిమానం ఉన్న కేసీఆర్ బెస్ట్ ఇన్వేటర్‌గా రాణించారు. ఆయన ప్రోత్సాహం, ప్రభుత్వం కల్పించిన అనుకూల వాతావరణం కారణంగా కంపెనీలు, పరిశ్రమలు రాష్ట్రానికి వరుసకట్టాయి. జాతీయ, అంతర్జాతీయ సంస్థల స్థాపనతో లక్షల ఉద్యోగాలు వచ్చాయి. టీ-హబ్, వీ-హబ్ సాయంతో ఎంతో మంది యువత స్టార్టప్‌లు ప్రారంభించారు. పాలకుడు ప్రజాభిమానం ఉన్న దార్శనికుడైతేనే ఇటువంటి ఆవిష్కరణలు సాధ్యమవుతాయి.

పైన చెప్పిన ఒక్కో నాయకుడు ఒక్కొక్క పథకం తెస్తే.. ఇవన్నీ తీసుకొచ్చిన కేసీఆర్ స్థాయి ఏంటో ప్రజలే నిర్ణయించుకోవాలి. ఇటువంటి నాయకుడి పాలనకు సంబంధించిన ఆనవాళ్లు లేకుండా చేయాలని భావించే ఇతర రాజకీయ నేతలను ఏమనాలో, ఏం చేయాలో ప్రజలే నిర్ణయించాలి.

ఓటు-రాజకీయం-ఆలోచన

భోజన్నగారి అనసూయ
99898 22494

ఈ దేశంలో పౌరులుగా పుట్టినందుకు ఓటు ఒక్కటే మన జీవితానికి కొలమానమా? రాజకీయాలు, పార్టీలు, ప్రతినిధులు ఇవి మాత్రమే ముఖ్యమా? కాదు కదా! మరి నిజం ఏమిటి? ఏ ప్రాంత ప్రజలైనా జరుగుతున్న పరిణామాలు నిశితంగా గమనించాలె. ఇక తెలంగాణ విషయానికి వస్తే కేసీఆర్ సార్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో నిర్వహించిన ప్రతి సభలోనూ చెప్పిన విషయం ఏమంటే.. 'దయచేసి మీరంతా ఆలోచించాలె. మీ ఇండ్లల్లో తెలిసినవారితో చర్చించాలె' అని. అంటే కేసీఆర్ సార్ చెప్పింది ఏమిటంటే.. మనల్ని ఎరుక కలిగి ఉండమని. అంతేగానీ, తన గెలుపు గురించి ఆయన ఆలోచించలేదు. 'జనాలు మోసపోవద్దు' అన్నదే ఆయన మాటల సారాంశం.

కేసీఆర్ నెత్తి, నోరు కొట్టుకొని చెప్పిన, మనమంచికోసమే మరీమరీ హెచ్చరించిన విషయం అది. 'అబ్బా! మనకే ఇన్నిసార్లు చెప్పుడా.. ఇంత చిన్న విషయం మాకు తెల్వదా' అని అనుకున్నరు ప్రజలు. ఎవుసానికి 24 గంటల కరెంట్, రైతుబంధు, చిన్న జిల్లాలు, జిల్లాకో మెడికల్ కాలేజీ, గురుకుల విద్యాలయాలు, బస్తీ దవాఖానలు, సకల సౌలత్‌లు.. అక్రమాలు, దళారీలు, లంచాలు లేకుండా అన్ని పనులు ఆన్‌లైన్‌లో జరుగుతుంటే మనకు వాటి విలువ తెల్వలేదు. 'ఇవి ఏమంత గొప్ప విషయాలా?' అని అనుకున్నాం కదా! సీన్ మారితే.. ఇవాళ ఏం మాట్లాడాలన్నా అభిమానం అడ్డు వస్తున్నది. ఎందుకంటే తెలిసి చేసిన తప్పు కదా!

నిప్పు కాల్తది అన్న విషయం తెలియని వారుండరు. చిన్నపిల్లలకి కూడా 'హాయి' కాల్తది అంటే 'అమ్మో హాయి హాయి' అని మనకే మళ్లీమళ్లీ అటు చూపించి చెప్తుంటరు. పదేండ్ల నుంచి తెలంగాణలో ఎంతో క్రమపద్ధతిలో అన్ని పనులు సవ్యంగా జరిగిపోతున్నాయని మనకు తెల్వదా? ఒక్కసారన్నా మనం విశాలంగా ఆలోచించాలె. మనకున్న రెండెకరాల భూమి, మనింట్లో ఉన్న నిరుద్యోగ బిడ్డ, కొడుకు, తాత, అవ్వ.. ఇంతేనా మనం ఆలోచించేది. దివ్యాంగులకు అన్నిరకాలుగా సహాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరడం ఒక ప్రత్యేక అవసరం. కానీ, ఏది ముందు, ఏది వెనుక అనేదాంట్లో కొంచెం వెనుకముందు అవుతాయి పనులు. మనిషికి ముందు నీళ్లే కదా ముఖ్యం. ఆ సమస్యకి ముందుగా సమయం పెట్టడం తప్పు కాదు కదా! ఆ తర్వాత మనందరికీ ముఖ్యమైన ఇంకో సమస్య కరెంట్ కదా. దాన్ని అద్భుతంగా అమలు చేయడం చూస్తిమి, అనుభవిస్తిమి కూడా. ఎక్కువ జిల్లాల ఏర్పాటుతో జిల్లా కేంద్రం దూరం తగ్గి ఇంకొన్ని పనులు చక్కబెట్టుకునే సమయం చిక్కె కదా? కానీ, మనం 'రైతు ఎవరైనా రైతే' అన్న ఉదాత్త విషయం మర్చిపోయి 'ఎకరం భూమి ఉన్న నాకే రైతుబంధు రావాలి. పది, యాభై, వంద ఎకరాల భూమి ఉన్న రైతుకు వచ్చుడు చాలా అన్యాయం' అని కడుపుమంటతో రగిలిపోతూ లేని పోని ఆలోచనలన్నీ నెత్తిన పెట్టుకున్నాం.

> ఇదే అదునుగా కడుపుమంట ఉన్న మిగతా పెద్ద మనుషులు కప్పలలాగా, కాకులలాగా ఒర్రి ఒర్రి 'ఇది చేస్తాం.. అది చేస్తాం' అనంగనే మార్పు కావాలి అనుకుంట మోసపోతిమి. ఇప్పుడు చచ్చిన పాముల్లాగా ఉండిపోయినం. 'ఆలోచించాలె' అని నెమ్మది మనిషి చెప్పినా ఆలోచించకుండా పెద్దపెద్ద రంకెలు వేసినం. 'మార్పు మాతోనే'నని మొగ్గు చూపినం. ఇప్పుడు మన అవస్థ 'కాకి నడక మర్చినం – హంస నడక రాదు' అన్న చందంగా తయారైంది.

కడుపులో చల్ల కదలకుండా, కూచున్న చోటు నుంచి ఫోన్‌తోనే బాయికాడి మోటరు చాలు చేసుడు, బంద్ చేసుడు ఉండేది. రైతుబంధు వచ్చి పెట్టుబడికి ఆసరా అవుడు, ఇండ్లల్లో కరెంట్ కష్టాలు తీరిపోవుడు.. ఇలా ఎన్ని? ఒకటని కాదు. వందలసార్లు కేసీఆర్ సారు చెప్పిండు 'మీరే ఆలోచించండి, చర్చ పెట్టండి' అని. అవకాశం మనకే ఇచ్చిండు సారు. ఒకసారి ఆలోచిద్దాం, చర్చ చేద్దాం అన్న ఆలోచనే మనకు రాలేదు. వచ్చినా దురభిమానమే ఎక్కువ మనకి. చిన్నప్పుడు మనం వినేది కదా.. కథల్లో, కలల్లో ఒక వ్యక్తిని వెనక్కి చూడకుండా ఫలానా సాధనం ఒకచోట నుంచి ఇంకో చోటుకి తీసుకుపోయేటప్పుడు 'వెనక్కి చూడకురా నాయనా' అని చెప్తే కొద్ది దూరం పోంగనే కుతూహలం కొద్దీ వెనక్కి చూసుడు.. ఆ పని చెడిపోవుడు, శాపాలు వగైరా.

ఇప్పుడు మనం అదే పని చేసి కూచున్నం. దాదాపు చాలా సమస్యలు తీరిపోయి 2014 నుంచి హాయిగా ఉంటున్నాం. నీళ్లు, కరెంట్, విద్యాలయాలు, వైద్యాలయాలు, ఇన్నిన్ని సౌకర్యాలతో నిరంతరంగా ముందుకు పోతున్న మనకు మార్పు అవసరమా? ఇవే సౌకర్యాలు చక్కగా కొనసాగితే చాలు అని ఆలోచన చేయకపోతిమి. నిరుద్యోగం గురించి మనం ఎక్కువ ఆశకుపోతున్నాం. ప్రభుత్వంపై ఎక్కువ ఆధారపడుతున్నం. ఏదో ఒకటి ప్రభుత్వమే చేయాలనే మన నిర్ణయం సరైనది కాదేమో! ఎక్కువ వనరులు, ఎక్కువ నిధులు ఉన్న కేంద్రమే నిరుద్యోగ సమస్య గురించి ఏమీ చేయలేనప్పుడు.. ఏ రాష్ట్రం మాత్రం ఇస్తుంది భారీగా ఉద్యోగాలు.

ముందు విషయాన్ని చక్కగా విశ్లేషించుకోవడం మనం అలవాటు చేసుకోవాలె. తెలియకపోతే కుహనా మేధావులను కాకుండా నిష్పక్షపాతంగా ఉండేవాళ్లతో చర్చించాలె. అన్ని తెలుసుకోవాలె. ఓట్లు, రాజకీయాలు, నాయకులు, ఆస్తులు, అంతస్తులు, ఉద్యోగాలు ఇవి మాత్రమే జీవితం కాదు. జీవితమంటే కొన్ని విలువలు, కొంత ఎరుక, నైతికత, కుటుంబం, ఇరుగు పొరుగు, ఊరు, సమూహం, సమాజం ఎన్నో కలబోసిన సమాహారమే జీవితం. దురభిమానంతో దాన్ని పణంగా పెట్టవద్దు.



ప్రాథమిక హక్కులపై దాడి

మన దేశంలో అధికారం దుర్వినియోగానికి గురవుతున్నది. వాక్‌స్వాతంత్ర్యాన్ని పాలకులు అణచివేస్తున్నారు. ప్రజా సమస్యలపై గళం విప్పే జర్నలిస్టులపై ఆంక్షలు విధిస్తున్నారు. పత్రికలు, ప్రతిపక్ష నేతలపై దాడులు జరుగుతున్నాయి. ఇది ముమ్మాటికీ ప్రాథమిక హక్కులపై దాడే. ప్రాథమిక హక్కులు హననానికి గురవుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదు.

- శరద్‌పవార్, రాజ్యసభ సభ్యుడు

వరద కాలువకు పీవీ పేరు పెట్టాలె

జూపల్లి రమేశ్ రావు
94925 70992

వృథాగా పోతున్న గోదావరి జలాలను ఒడిసిపట్టేందుకు 31 ఏండ్ల కిందట పీవీ నరసింహారావు చేసిన అద్భుతమైన ఆలోచనకు ప్రతిరూపమే శ్రీరాంసాగర్ ప్రాజెక్టు. 1993 జూన్ 30న నిజామాబాద్ జిల్లాలో ప్రధాని హోదాలో పీవీ పర్యటించారు. ఎస్సారెస్పీ ప్రాజెక్టును సందర్శించి ముప్కాల్ సమీపంలో వరద కాలువకు శంకుస్థాపన చేశారు. గోదావరిలో పారే వరద నీటిని ప్రత్యేక కాలువ ద్వారా ఉమ్మడి కరీంనగర్, వరంగల్, నల్లగొండ జిల్లాలకు సాగు నీరు అందించాలనే లక్ష్యంతో పీవీ దీని నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అయితే ఈ ప్రాజెక్టుతో సంబంధమే లేని ఇందిరాగాంధీ పేరును దీనికి పెట్టి పీవీకి మరోసారి కాంగ్రెస్ అన్యాయం చేయడం శోచనీయం.

ఒక్కసారి చరిత్రలోకి తొంగిచూస్తే.. 1983లో శ్రీరాంసాగర్‌కు భారీగా వరదలు వచ్చాయి. ఆ నీరంతా వృథాగా సముద్రంలో కలిసిపోయాయి. ఇలా వరదలు వచ్చిన ప్రతిసారి ప్రాజెక్టు గేట్లు ఎత్తి జలాలను దిగువకు వదిలేసేవారు. వృథాగా పోతున్న నీటిని వినియోగించుకోవాలనే లక్ష్యంతో వరద కాలువను నిర్మించాలనే ఆలోచన పురుడుపోసుకున్నది. అనుకున్నదే తడవుగా నిజామాబాద్ జిల్లా ముప్కాల్ సమీపంలో వరద కాలువ నిర్మాణానికి పీవీ శంకుస్థాపన చేశారు.

అయితే నాటి సమైక్య (కాంగ్రెస్, టీడీపీ) పాలకుల వివక్ష, నిర్లక్ష్యం కారణంగా ఎస్సారెస్పీ వరద కాలువ నిర్మాణంలో తీవ్రంగా జాప్యం జరిగింది. ఏడేండ్లలోనే పూర్తవ్వాల్సిన వరద కాలువ.. పీవీ ప్రధాని పీఠం దిగే సమయానికి కూడా పూర్తవలేదు. 2010 వరకు ట్రయల్ రన్ జరగలేదంటేనే.. వలస పాలకుల వివక్షను అర్థం చేసుకోవచ్చు. దీనికి తోడు ఎస్సారెస్పీ ఎగువన మహారాష్ట్ర ఇబ్బడిముబ్బడిగా కట్టిన అక్రమ ప్రాజెక్టుల మూలంగా చుక్కనీరు వచ్చే పరిస్థితి లేదు. నీటి లభ్యత కొరవడిన నేపథ్యంలో అసలు లక్ష్యానికే గండి పడే దుస్థితి దాపురించింది. దీంతో కాలక్రమేణా లోయర్ మానేరు డ్యాంకు మాత్రమే నీటిని నింపేందుకు వరద కాలువను ప్రధాన వనరుగా పాలకులు మార్చేశారు. ఫలితంగా తెలంగాణ రైతాంగం సంక్షేమాన్ని కోరుతూ పీవీ కన్న కలలన్నీ కల్లలయ్యాయి.

దశాబ్దాల పోరాట ఫలితంగా సీమాంధ్ర పాలకుల ఉక్కు సంకెళ్లను తెంచుకున్న తెలంగాణ రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన కేసీఆర్ వరద కాలువకు తిరిగి జీవం పోశారు. కాళేశ్వరం, ఎస్సారెస్పీ పునర్జీవ పథకం ద్వారా పీవీ కలలను సఫలం చేశారు. ఏటా బోసిపోతున్న పోచంపాడు ప్రాజెక్టుకు కొత్త కాంతులు తీసుకురావాలనే ఆశయంతో కేసీఆర్ సంకల్పించిన పునర్జీవ పథకం మూలంగా.. నేడు వరద కాలువ నిండుగా కనిపిస్తున్నది. కాళేశ్వరం నుంచి మిడ్‌మానేరు, మల్లన్న సాగర్, కొండపోచమ్మ, హల్దివాగు ద్వారా నిజాంసాగర్ ప్రాజెక్టుకు నీళ్లు పంపి తద్వారా ఎస్సారెస్పీకి నీటిని మళ్లించాలని తొలుత తెలంగాణ ప్రభుత్వం భావించింది. అయితే అందులో ఉన్న సంక్లిష్టతల కారణంగా ఆ నిర్ణయాన్ని మార్చుకున్నది. నీటిపారుదల రంగ నిపుణులతో సంప్రదించాక వరద కాలువ 102వ కిలోమీటరు వరకు కాళేశ్వరం జలాలను తరలించి.. అక్కడి నుంచి రివర్స్ పంపింగ్ చేయాలనే నిశ్చయానికి వచ్చింది కేసీఆర్ సర్కార్. అలా ఎస్సారెస్పీ పునర్జీవ పథకంతో గోదావరి జలాలను ఎదురెక్కించి వరద కాలువను నింపి మూడు కాలాలు నిండు కుండలా ఉండేలా మార్చేశారు కేసీఆర్. ఈ విధంగా కేసీఆర్ హయాంలో పీవీ స్వప్నం సాకారమైంది.

> పీవీకి దేశ అత్యున్నత పురస్కారం భారతరత్న వరించిన నేపథ్యంలో వర